పంచాయతీ కార్యదర్శులకు పనిభారం

- 15 గ్రామాలు, 5 శివారు గ్రామాలకు పది మందే కార్యదర్శులు!
- పన్ను వసూళ్లు, సర్వేలు, స్వచ్ఛ పర్యవేక్షణలతో సతమతం
- సంక్షేమ పథకాల అమలుతో ఉక్కిరిబిక్కిరి



నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయం

నాదెండ్ల: పనిభారంతో పంచాయతీ కార్యదర్శులు సతమతమౌతున్నారు. నాదెండ్ల మండల పరిధిలో 15 గ్రామ పంచాయతీలుండగా, మరో ఐదు శివారు గ్రామాలున్నాయి. 15 గ్రామ పంచాయతీలకు గాను కేవలం పది మంది మాత్రమే కార్యదర్శులు పనిచేస్తున్నారు. మిగిలిన 5 గ్రామాలకు వీరే అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. చిరుమామిళ్ళ పంచాయతీ కార్యదర్శి ఠాగూర్ రెడ్డికి జంగాలపల్లె, సంకురాత్రిపాడు, సాతులూరు పంచాయతీ కార్యదర్శి రాఘవయ్యకు గొరిజవోలు, కనపర్రు, అమీన్‌సాహెబ్‌పాలెం కార్యదర్శి కె.మధుకు ఇర్లపాడు పంచాయతీ బాధ్యతలు అప్పగించారు.

ఇంటిపన్ను వసూళ్ల లక్ష్యం నెరవేరేనా!

గ్రామ పంచాయతీల్లో నూరుశాతం ఇంటి పన్ను వసూళ్ళ లక్ష్యం పంచాయతీ కార్యదర్శులను కునుకు లేకుండా చేస్తోంది. ఫిబ్రవరి మాసంలో ఇంటి యజమానులకు నోటీసులు అందించారు. మార్చి 1 నుంచి పన్ను వసూళ్లు ప్రారంభమయ్యాయి. నేటి వరకూ పంచాయతీల్లో 20 శాతం కూడా ఇంటి పన్నులు వసూలు కాలేదని కార్యదర్శులే చెబుతున్నారు. ఒక పక్క ఉన్నతాధికారులు ఇంటి పన్నులు వసూలు చేయాలంటూ వీడియో కాన్ఫరెన్సులు, సమావేశాల్లో టార్గెట్లు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి పన్నులు నూరు శాతం లక్ష్యం నెరవేరేనా అనేది చూడాల్సిందే.

పీ4 సర్వేతో ఉక్కిరిబిక్కిరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్‌-పబ్లిక్‌-పీపుల్స్‌ పార్టనర్‌షిప్‌ (పీ4) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రకటించింది. పీ4 కార్యక్రమ అమలుకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన వివరాలు సేకరించాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో వివరాల సేకరణకు సమయం పడుతుందని, నిర్దిష్ట గడువు నాటికి సర్వే పూర్తి చేయటం కత్తిమీద సాములా ఉందని కార్యదర్శులు పేర్కొంటున్నారు.

ప్రతి మూడో శనివారం స్వచ్ఛ గ్రామాలు

ప్రతి గ్రామంలో మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛగ్రామాలు కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గ్రామాల్లో తాను ఆకస్మికంగా తనిఖీ చేసినపుడు ఎక్కడైనా చెత్త, అపరిశుభ్రత వాతావరణం కనిపిస్తే సదరు పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తానంటూ జిల్లా కలెక్టర్ హెచ్చరించిన విషయం విదితమే. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పర్యవేక్షణ, చెత్తాచెదారాలు, మురుగుకాల్వలు శుభ్రం చేసి సంబంధిత యాప్‌లో లోడ్ చేయాల్సి ఉంది. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మోయలేనంత పనిభారం

పనుల భారంతో రోజువారీ పనులు ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. దీనికితోడు ఒకటికి మించి పంచాయతీల పర్యవేక్షణ భారంతో సతమతమౌతున్నట్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రతి పంచాయతీకి కార్యదర్శిని నియమించాలని కోరుతున్నారు. అప్పుడే గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి వ్యవస్థల నిర్వహణ, పన్నుల వసూళ్లు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు సజావుగా జరుగుతుందని చెబుతున్నారు.

కార్యదర్శుల కొరత ఉంది



మండలంలో 15 పంచాయతీలు, 5 శివారు గ్రామాలున్నాయి. ప్రస్తుతం పది మంది కార్యదర్శులు ఆయా గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. మార్చి నెల కావటంతో పనిభారం పెరిగింది. ఇన్‌చార్జి కార్యదర్శులకు పనిభారం తగ్గించేందుకు ఆయా గ్రామ సచివాలయాల బాధ్యత మండల పరిషత్ పరిధిలో తీసుకొస్తే పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది.

– స్వరూపరాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో, నాదెండ్ల.

సొమ్మొకరిది... సోకొకరిదా?

- కోటప్పకొండ ముఖద్వార పేరు మార్పు ప్రతిపాదనపై చిలకలూరిపేటలో వైఎస్సార్‌ సీపీ కౌన్సిలర్ల ధ్వజం
- మున్సిపల్ సమావేశం నుంచి వాకౌట్


మాట్లాడుతున్న వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు

చిలకలూరిపేట: పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్లో కోటప్పకొండ కు వెళ్లే మార్గంలో మాజీ మంత్రి విడదల రజిని తన సొంత నిధులు వెచ్చించి త్రికోటేశ్వరస్వామి ద్వారం పేరున ఆర్చి నిర్మిస్తే ఇప్పుడు దానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేరు పెట్టాలని ఎజెండాలో పొందుపరచటం ఏమిటి... సొమ్ము ఒకరిది, సోకు ఒకరిది అన్నట్లుగా ఉంది వ్యవహారం అంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించారు.

సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఎజెండాలో 30వ అంశంగా చేర్చిన కోటప్పకొండ రోడ్డు ముఖద్వారం ఆర్చిపై ప్రత్తిపాటి పుల్లారావు పేరు చేర్చేందుకు ప్రతిపాదించటంపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ విషయంలో టీడీపీ సభ్యులు మాజీ మంత్రి విడదల రజిని పేరు తొలగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు మాట్లాడుతూ త్రికోటేశ్వరస్వామి ద్వారం అనే పేరు తొలగించటం లేదని, కుడివైపున ప్రత్తిపాటి పుల్లారావు పేరును చేర్చటానికి ఎజెండాలో పొందుపరిచామని వెల్లడించారు. దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ముందుగా ఎజెండా చదవడం పూర్తయ్యాక ఎన్ఆర్‌టీ రోడ్డులో మాజీ మంత్రి విడదల రజిని నివాసం వద్ద డ్రెయిన్లను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని ఆరోపణలు చేశారు. ఈ విషయమై వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ యూసుప్ ఆలి మాట్లాడుతూ కావాలనే మాజీ మంత్రి పేరు ప్రస్తావిస్తున్నారని, అక్కడ డ్రెయిన్ల నిర్మాణం విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగలేదని, పట్టణంలో ఉన్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. 34వ వార్డు కౌన్సిలర్ వడితే కోట్యా నాయక్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా తన వార్డులో ఉన్న సమస్యలు ప్రస్తావిస్తున్నా వాటిని పట్టించుకోకుండా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన తనపై వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే వార్డులో 15 సెంట్ల రిజర్వు స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ స్థలం ఆక్రమించుకున్న వారితో మాట్లాడామని, ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ వేసవి కాలంలో పైపులైన్ లీకుల పేరుతో పలు ప్రాంతాలలో నీటి సరఫరా నిలిపివేస్తున్నారని, అలాంటి ప్రాంతాలకు కనీసం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాగునీరు సరఫరా చేసిన ట్యాంకర్లకు బిల్లులు చెల్లించటం లేదని మండి పడ్డారు. కమిషనర్ మాట్లాడుతూ నీరు అందని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని పలువురు కౌన్సిలర్లు ప్రస్తావించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే 100 కుక్కలను పట్టుకొని కుటుంబ నియంత్ర ఆపరేషన్లు చేయించామని, మిగిలిన కుక్కలకు కుటుంబ నియంత్ర ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు.

కార్యకర్తలూ... ఎవ్వరూ అధైర్యపడవద్దు


మాట్లాడుతున్న మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడవద్దని పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన శ్రీ వీరాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ నుంచి ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎవ్వరూ భయపడవద్దని, మళ్లీ మనం వైస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందామన్నారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేంత వరకూ అందరూ ధైర్యంగా ఉండాలన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, ఇబ్బందులు పెట్టినా దడిసే ప్రసక్తి లేదన్నారు. రెడ్ బుక్ బెదిరింపులకు ఎవ్వరూ భయపడరన్నారు. సమయం వచ్చినప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలన అంటే ఏమిటో చూపిస్తామన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. రైతులు, డ్వాక్రా అక్కా చెల్లెమ్మలు, విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సెల్‌ఫోన్‌లపై జగన్ స్టిక్కర్‌లు వేసుకుంటే గొర్రెలు కూడా కాయవద్దు అంటున్నారని యర్రగొండపాలెంకు చెందిన ఓ కాపరి గోపిరెడ్డికి ఫిర్యాదు చేశాడు. తెలుగుదేశం పార్టీ వారి అరాచకాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయన్నారు. ప్రభను ఏర్పాటు చేసిన గ్రామస్తులకు, తిరునాళ్లకు వచ్చిన భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుగంటి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, పొలిమేర వెంకటరెడ్డి, పునుగోటి వెంకట్రావు, బీరం భాస్కర్‌రెడ్డి, గుండాల వెంకటేష్, వరవకట్ట బుజ్జి, పడాల హనిమిరెడ్డి, పలువురు గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

శావల్యాపురం: ఇంటి పన్నులు వసూలు నూరు శాతం చేయాలని ఈవోపీఆర్‌డీ పి.సుగుణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలలో ఇంటి పన్నులు బకాయిలు ఇప్పటి వరకు రూ. 50 లక్షల 25 వేలు ఉందని, ఇందుకుగాను రూ. 28 లక్షల 27 వేలు వసూలు అయినట్లు తెలిపారు. ఇంటి పన్నుల చెల్లింపుల్లో ప్రజలందరు పంచాయతీ కార్యదర్శులకు సహకరించాలన్నారు. నెలాఖారులోగా నూరు శాతం వసూలు అయ్యేలా పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

వినుకొండ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి తెలిపారు. ఈ సమావేశంలో పట్టణంలోని నిర్వహించే పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చలు నిర్వహించనున్నారు. సమావేశానికి వైస్‌చైర్‌పర్సన్, వార్డుమెంబర్లు, అధికారులు హాజరుకావాలని సూచించారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ



నూజెండ్ల: చిరుధాన్యాల ఉత్పత్తులను రైతులు సాగు చేయాలని లాంఫామ్ మిల్లెట్స్ ప్రధాన శాస్త్రవేత్త చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో చిరుధాన్యాల సాగు, వాటి విలువ ఆధారిత ఉత్పత్తులపై ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటరు యం.నగేష్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న, సజ్జా, వంటి ముతక ధాన్యాలతో పాటు కొర్ర,రాగి, వరిగలు,అండు కొర్రెలు, సామలు వంటి చిరుధాన్యాలను సాగు చేయాలన్నారు. తక్కువ వ్యయంతో ఎక్కువ ఆదాయం రైతులు పొందవచ్చునన్నారు. ముతక ధాన్యంతో పాటు చిరుధాన్యం సాగు చేయటం వలన రైతులకు వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు. ఒక ఎకరం వరి పంటకు వినియోగించే సాగునీరును నాలుగు ఎకరాలు చిరుధాన్యాల సాగు చేయవచ్చునన్నారు. ఈపంటలకు చీడపీడలు ఎక్కువగా ఆశించవన్నారు. పురుగుమందుల అవశేషాల ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్, ఏవో సుగుణాబేగం, డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, లగడపాటి సూరిబాబు, కంచుమాటి తిరుపాలు, చిరంజీవి, వీరనారాయణ, వీఏఏ అశోక్, రేవంత్ రైతులు పాల్గొన్నారు.

ఆందోళనకు దిగిన మున్సిపల్ కార్మికులు

- కమిషనర్ వైఖరికి నిరసనగా విధులు బహిష్కరణ
- మద్దతు తెలియచేసిన సీఐటీయూ నాయకులు
- అప్కాస్‌లో ఉన్న వారందరికీ రూ.21 వేలు జీతం చెల్లించాలని డిమాండ్



మహాత్ముని విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: పని చేసినన్ని రోజులకు వేతనాలు ఇవ్వమని అడిగితే ఇష్టమైతే చేయండి లేకపోతే లేదనే మున్సిపల్ కమిషనర్ వైఖరికి నిరసనగా పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. ఆప్కాస్‌లో పేర్లు నమోదై తక్కువ వేతనాలకు విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను బహిష్కరించి ఆందోళన బాట పట్టారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ, గడియార స్తంభం సెంటర్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలదండ వేసి తమ ఆందోళన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమకు న్యాయం చేయాలని, పని భద్రత కల్పించాలని, మిగతా కార్మికులతో పాటు రూ.21 వేలు వేతనం, కొబ్బరి నూనె, చెప్పులు, సబ్బులు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి సిలార్ మసూద్ సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. కార్మికులు చేస్తున్న న్యాయమైన ఆందోళన కార్యక్రమానికి అండగా ఉంటామని, వారి సమస్యలు పరిష్కారానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని, మున్సిపల్ కమిషనర్ చొరవచేసి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ ఆందోళన జిల్లాస్థాయిలో తీసుకు వెళతామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సాల్మన్, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు బండ్ల మహేష్ సంఘీభావం తెలియజేయగా, సమాధానం, ఇంద్రయ్య, జె శ్రీను, దేవదానం, వీరయ్య, రాజు పాల్గొన్నారు.

26న జామాయిల్ రైతుల ధర్నా


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నరసరావుపేట ఈస్ట్: అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జామాయిల్ కర్ర వేలంపాట, అక్రమ రవాణాలను నిరసిస్తూ సామాజిక వన రైతుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి స్పష్టం చేసారు. అరండల్‌పేటలోని అవ్వారి భావనారాయణ భవన్ సీపీఐ కార్యాలయంలో గురువారం సామాజిక వన రైతుల సంఘం రాష్ట్ర సమితి సమావేశం తాళ్లూరి బాబురావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో హనుమారెడ్డి మాట్లాడుతూ, పలనాడు డివిజన్ అటవీ శాఖ పరిధిలోని వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల ప్రాంతాలలోని 218 వన సంరక్షణ సమితిల ఆధ్వర్యంలో పెంచిన జామాయిల్ కర్ర వేలంపాటలో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. అలాగే వ్యాపారులు కర్రను అనధికారికంగా నరుకుతూ అక్రమ రవాణా చేస్తున్నారని తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచిన జామాయిల్‌ను వేలం నిర్వహించటం ద్వారా రైతాంగానికి రూ.1000 నుంచి రూ.1500లు దాకా ధర తగ్గి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాదు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.జమలయ్య, సామాజిక వన రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పి-4 సర్వేపై అవగాహన సదస్సు

శావల్యాపురం: ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరికం నిర్మూలన సర్వే నూరు శాతం పూర్తి అయిందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈశ్రమ, శక్తి అభియాన్‌లపై గ్రామ సమాఖ్యా సభ్యులు, ఉపాధి ఫీల్డ్ అసిసెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 10711 నివాస గృహాలు ఉండగా 10657 గృహాలను సర్వే చేసినట్లు తెలిపారు. పీ-4 సర్వే ప్రక్రియ పూర్తి అయిందని ఈనెల 24లోగా గ్రామసభలు నిర్వహించాలన్నారు. మహిళలు సంరక్షణ కోసం ప్రభుత్వం శక్తి అభియాన్ యాప్‌పై అవగాహన పెంపొందించాలన్నారు.ఉపాధి కూలీలకు ఈశ్రమ బీమా యోజన పథకం అర్హత పొందేలా చూడాలన్నారు. ఈసమావేశంలో ఏపీయం జి.వాసుబాబు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు, బ్యానర్లు నిషేధం

నరసరావుపేట: పట్టణంలోని గోడలు, డివైడర్లపై పోస్టర్లు, బ్యానర్లు అంటించటాన్ని నిషేధించటమైందని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాపారులు, ముద్రణాలయాల నిర్వాహకులు, సినిమా థియేటర్, విద్యాసంస్థలు యజమానులు, మత సంస్థల ప్రతినిధులు పోస్టర్లు అంటించిన యెడల వారిపై చట్టపరమైన చర్యలతో పాటు జరిమానా విధించటం జరుగుతుందని హెచ్చరించారు.

నేడు పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రసాద్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకూ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఎమర్జెన్సీ మెయింటెనెన్స్ కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలైన ఇర్లపాడు, ఎండుగుంపాలెం , బుక్కాపురం, రాజుగారిపాలెం, గున్నావారిపాలెంలో పరిశ్రమలు, గృహాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుందన్నారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

రాజ్యాంగ పరిరక్షణసమితి అధ్యక్షుడు సుబ్బారావు

నాదెండ్ల: చట్ట సభల్లో బీసీలు, మైనార్టీ ముస్లింలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు లేకపోవటం బాధాకరమని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. సాతులూరు ఎస్సీ కాలనీలో సమితి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1941లో జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 38.66 కోట్లు కాగా, ఆనాడు ఎస్సీలకు రాజ్యాంగ పరిషత్‌లో 15 శాతం, విద్యా ఉద్యోగ చట్టసభల్లో 7 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. 2024 నాటికి భారతదేశ జనాభా 145 కోట్లు అంచనాకాగా, స్వతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల నిండినా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో సీట్లు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారన్నారని విమర్శించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు బి.సలోమన్, లాజరస్, పురుషోత్తం, అబ్రహం, పవన్ ఉన్నారు.

మహిళపై దాడి

శావల్యాపురం: పొలానికి సాగు నీరు పెట్టుకునే విషయంలో మహిళపై దాడి చేసిన సంఘటన మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన వెలమవారిపాలెం గురువారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల మేరకు గ్రామానికి చెందిన రేటునేని అనురాధ మొక్కజొన్న పంట సాగు కోసం కాల్వ దగ్గరకు వెళ్లగా నీరు రానివ్వకుండా కాలువకు అడ్డుకట్ట వేశారన్నారు. ఇదేమని ప్రశ్నించిన రేటినేని అనురాధ ఇంటికి వెళ్లి అదే గ్రామానికి చెందిన పొట్లపల్లి లక్ష్మయ్య, నాగినేని శ్రీను, లక్ష్మి, బ్రహ్మయ్య, ఆర్.కృష్ణమూర్తి, కుమారి, మహేశ్వరిలతో పాటు మరి కొంతమంది దాడులకు పాల్పడగా రేటినేని అనురాధ ముఖంపై, ముక్కుపై గాయాలయ్యాయి. ఈవిషయాన్ని వినుకొండ పట్టణంలో వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును స్వయంగా కలిసి జరిగిన సంఘటన గురించి వివరించినట్లు తెలియజేయగా బాధితులకు అండగా ఉంటామని సాగునీరు విషయంలో ఇలాంటి సంఘటనలు జరగటం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బాధితురాలు రేటినేని అనురాధ ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు.

వినుకొండ విద్యార్థికి బంగారు పతకం

వినుకొండ: గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని వినుకొండ సీనియర్ న్యాయవాది ఎం.వి అప్పారావు శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె దేవీప్రసన్న కు ఎంఎస్‌సి యోగ థెరపీ గోల్డ్ మెడల్ సాధించింది. సెంట్రల్ యూనివర్సిటీ విద్య పీఠంలో 2023 నుండి 2024 సంవత్సరంకు ఈ రోజు తిరుపతి నుందు గల మహతి ఆడిటోరియంలో నాలుగవ స్నాతకోత్సవం సందర్భంగా వైస్ ఛాన్సలర్ గొల్లపల్లి కృష్ణమూర్తి గారి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నారు. గోల్డ్‌మెడల్ సాధించిన దేవీ ప్రసన్నను పలువురు న్యాయవాదులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ధర్నా

నరసరావుపేటటౌన్: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మీటర్ రీడర్స్ ఉద్యోగులు గురువారం విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి షేక్ యాసిన్ మాట్లాడుతూ రీచార్జి స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న మీటర్ రీడర్‌లు అందరికీ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలన్నారు. మీటర్ రీడర్స్ అందరికీ కనీస వేతనం అమలు చేయాలన్నారు. అనంతరం సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ పి.విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమం అందాలి

రొంపిచర్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ అందజేయాలని ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎండీవో మ్యాథ్యుబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం పి-4 సర్వే చేపట్టం జరిగిందన్నారు. ఈ సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. గృహ నిర్మాణ పథకం క్రింద గృహాలు నిర్మించుకునే ఎస్సీ, బీసీలకు రూ.50 వేల రూపాయలు, ఎస్టీలకు రూ.75 వేల రూపాయలు, ఆదివాసీలకు రూ.లక్ష రూపాయలు అదనంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ సతీష్, ఏవో కె. శివలలిత, పంచాయతీ రాజ్ ఏఈ కె. అరుణ, హౌసింగ్ ఏఈ సురేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా భూ సేకరణ చేయాలి



నరసరావుపేట రూరల్: వినుకొండ- గుంటూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూసేకరణను రోడ్డుకు ఇరువైపులా చేయాలని రైతులు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను కోరారు. జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆయను ఉప్పలపాడు గ్రామ రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. వినుకొండ- గుంటూరు జాతీయ రహదారి విస్తరణ కోసం అధికారులు సర్వే చేస్తున్నారని తెలిపారు. నాలుగు లైన్ల విస్తరణ కోసం 180 అడుగులు అవసరం కాగా ప్రస్తుతం 148 అడుగులు అందుబాటులో ఉందన్నారు. మరో 32 అడుగులు అవసరం కాగా దీనిని ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఒక వైపునే సేకరించాలని అధికారులు భావిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీని వలన సన్న, చిన్నకారు రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా నష్టపోతారని వివరించారు. రోడ్డు విస్తరణకు భూమిని ఇరువైపులా సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

సత్తా చాటిన ధనలక్ష్మి కళాశాల జట్టు

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన క్రీడాకారులు 19,20 తేదీల్లో ఆర్‌వీ ఆర్ ఈజేసీ ఇంజినీరింగ్ కళాశాల చోడవరంలో జరిగిన అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొని ప్రథమస్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చుండు వెంకటరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈటోర్నమెంటులో 9 జట్లు పాల్గొనగా అందరు మంచి ప్రతిభ కనపరిచి విజేతలుగా సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన జట్టును కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, అరవింద్, దాసు, వంశీలు ప్రత్యేకంగా అభినందించారు.

ఆసుపత్రికి బీరువా బహూకరణ

వినుకొండ: పట్టణంలోని కొత్తపేట ఎస్‌ఎస్‌పీ కాలనీలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కి మానవ సేవ సమితి సభ్యులైన ఎస్ఎస్‌పీ ఎంటర్ ప్రైజెస్ యజమాని మస్తాన్ బీరువా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మానవ సేవ సమితి అధ్యక్షులు పీవీ సురేష్ బాబు డాక్టర్ పర్వీన్, డాక్టర్ సోము నాయక్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభినందించారు.

మానసిక దృఢత్వం కలిగి ఉండాలి


సైకాలజిస్ట్ అండ్ కౌన్సిలర్ రావలి శాంతి వర్ధన్

రొంపిచర్ల : సమాజంలో రాణించాలంటే మానసిక దృఢత్వం కలిగియుండాలని సైకాలజిస్ట్ అండ్ కౌన్సిలర్ రావలి శాంతి వర్ధన్ అన్నారు. మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం విద్యార్థినులకు 'మెంటల్ హెల్త్ అండ్ కెరియర్ గైడెన్స్' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శాంతి వర్ధన్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల పట్ల విద్యార్థినీలు పూర్తి అవగాహన కలిగి ఉంటేనే విద్యలో అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. నేటి సమాజంలో మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. బాలికలు చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. బాలశౌరీలు, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

దివీస్ ల్యాబ్‌లో 41 మందికి ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో హైద్రాబాద్‌కు చెందిన దివీస్ ల్యాబ్ గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించి 41 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసింది. ప్రాంగణ ఎంపికలకు 98 మంది హాజరుకాగా రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి 41 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.2.4 లక్షల నుంచి రూ.3 లక్షల వార్షిక వేతనం అందిస్తారని దివీస్ ల్యాబ్ హెచ్‌ఆర్‌లు కె.రామకృష్ణ, జె.శివకృష్ణ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు హైద్రాబాద్, వైజాగ్, కాకినాడలో బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎంవి శేషగిరిరావు, డైరక్టర్ దరువూరి శ్రావ్య, ప్లేస్‌మెంట్ సెల్ అధికారి డాక్టర్ బీ.రవితేజ, అధ్యాపకులు అభినందించారు.

ఉపాధి పనులపై ఏసీబీ అధికారులు విచారణ



నూజెండ్ల: ఉపాధి పనులపై గత రెండు రోజుల నుంచి ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిసెంట్స్ ఉపాధి కూలీల చేసిన పనులను విచారించారు. మండల పరిధిలోని నూజెండ్ల, మారెళ్ళవారిపాలెం, పువ్వాడ, కొండల రాయునిపాలెం, కె.జడ్డావారిపాలెం, గ్రామాల్లో 2018-19 ఉపాధి పథకంలో చేపట్టిన ఐదు పనులపై ఎంబుక్, కూలీల మస్టర్లను పనుల జరిగిన ప్రదేశాలను పరిశీలించి విచారణ చేసినట్లు ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు సుబ్బారావు, సురేష్, తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ అల్లా భక్షు, శ్రీనివాసరావులు ఉన్నారు.

ఆక్రమణలకు వ్యతిరేకంగా ధర్నా

నరసరావుపేట: సత్తెనపల్లిరోడ్ ఏనుగుల బజార్ ఆవుల సత్రం పక్కన కత్తవ వాగును ఆక్రమిస్తూ నిర్మిస్తున్న ఆక్రమణలు తొలగించి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధికారుల ఆదేశాలను పట్టించుకోని మున్సిపల్ అధికారుల వైఖరిని ఖండిస్తూ గురువారం నిర్మాణ స్థలంలో ప్రజా సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఈసందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సర్వే నెంబరు 176లోని 242 గజాలు కొనుగోలు చేసిన వ్యక్తులు పక్కనే ఉన్న కత్తవ వాగును సైతం ఆక్రమించి అందులో భీములు వేసి కాలువ మొత్తాన్ని కబళించాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు.